క్లుప్తంగా

సీఎం కప్ పోటీలకు స్థల పరిశీలన

మధిర: ఈ నెల 15 నుంచి 17 వరకు నిర్వహించనున్న సీఎం కప్ క్రీడల పోటీలకు సంబంధించిన స్థలాన్ని మధిర టీవీఎం పాఠశాలలో శనివారం ఎంపీడీఓ సీలార్ సాహెబ్, ఎంపీపీ లలిత పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ క్రీడల్లో ఆసక్తి కలిగిన వారు పాల్గొనవచ్చునని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ వై.ప్రభాకర్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

బోనకల్: గ్రామదీపికల సమస్యలను పరిష్కరించాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు పోతినేని సుదర్శన్‌రావు అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం ముందు గ్రామదీపికల సమ్మెకు శనివారం సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామదీపికలు డ్వాక్రా గ్రూపుల అభివృద్ధిలో కీలక పాత్ర నిర్వహిస్తున్నారన్నారు. కానీ వారికి ఉద్యోగ భద్రత, కనీస వేతనం అమలుచేయడం లేదన్నారు. సంఘీభావం తెలిపిన వారిలో పార్టీ మధిర నియోజక వర్గ ఇన్‌చార్జ్ పాలడుగు బాస్కర్, జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నంబూరి సేవలు అభినందనీయం



మధును సత్కరిస్తున్న ఎమ్మెల్యే రాములు నాయక్

వైరా: లయన్స్ వీడీజీ–2గా ఎన్నికై సామాజిక సేవాకార్యక్రమాలు నిర్వహిస్తున్న వైరాకు చెందిన లయన్స్ క్లబ్ సభ్యుడు నంబూరి మధు సేవలు అభినందనీయం అని వైరా ఎమ్మెల్యే లావుడ్యా రాములునాయక్ అన్నారు. శనివారం క్యాంపు కార్యాలయంలో నంబూరి మధును ఆయన శాలువ జ్ఞాపికతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా రాములునాయక్ మాట్లాడుతూ.. లయన్స్‌క్లబ్ వీడీజీ–2గా ఎన్నికైన మధు భవిష్యత్తులో మరెన్నో ఉన్నత పదవులు సాధించి సేవా కార్యక్రమాలను విస్తృత పరచాలన్నారు. అనంతరం పలువురు లయన్స్‌క్లబ్ సభ్యులు, స్థానిక నాయకులు నంబూరి మధును ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ముళ్లపాటి సీతారాములు, మద్దెల రవి, వనమా విశ్వేశ్వరరావు, చింతోజు నాగేశ్వరరావు,డాక్టర్ భూమాత కృష్ణమూర్తి, డాక్టర్ కాపా మురళీ కృష్ణ, మిట్టపల్లి సత్యంబాబు, సైదా, మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

మామిడి తోటలో చెట్ల నరికివేత

కల్లూరు: మండలంలోని పేరువంచ సమీపాన మామిడి తోటను అమ్మాలని బెదిరించిన ఓ వ్యక్తి చెట్లు నరికివేయించాడని రైతు ఆరోపించాడు. గ్రామానికి చెందిన తోకచిచ్చు ఆంజనేయరాజు 2014లో 42 కుంటల విస్తీర్ణంలో మామిడితోటను మానాల రవికుమార్ నుంచి కొనుగోలు చేశాడు. కొన్ని నెలలుగా తోట తిరిగి అమ్మాలని రవికుమార్ ఒత్తిడి తీసుకొస్తుండగా పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు రాజు తెలిపారు. ఇంతలోనే శుక్రవారం రాత్రి తోటలోని రెండు చెట్లను నరికి వేయించాడని ఆరోపించారు.

వసతులు కల్పించాలి

సత్తుపల్లిరూరల్: జేవీఆర్ ఓసీలో సీహెచ్‌పీలో కనీస మౌళిక వసతులు కల్పించాలని టీబీజీకేఎస్ ఫిట్ సెక్రటరీ జేఎస్ఆర్ మూర్తి అన్నారు. ఈ సందర్భంగా శనివారం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని సీహెచ్‌పీ ఇన్‌చార్జ్ కృష్ణయ్యకు అందించారు. జేవీఆర్ సీహెచ్‌పీలో కార్మికులకు సరైన క్యాంటిన్, విశ్రాంతి గది లేదన్నారు. ఎండలు మండుతున్న దృష్ట్యా ఉద్యోగులకు తాగటానికి వాటర్ కూలర్, ఎయిర్ కూలర్ ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వరప్రసాద్, జనగం శ్రీను, నాగేంద్రరావు, నాగయ్య, నగేష్, చంద్రమౌళి, మహేష్, నాగేందర్, యశ్వంత్, తిరుమలరెడ్డి, రాజమొగిలి పాల్గొన్నారు.

ఎనుముల రుక్మిణికి అవార్డులు

కల్లూరు: కల్లూరుకు చెందిన హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ ఆఫ్ పీపుల్ జిల్లా కార్యదర్శి ఎనుముల రుక్మిణీయాదవ్‌ను అవార్డులు వరించాయి. నల్లగొండ జిల్లా చిట్యాలలో పుడమి సాహితి ఫౌండేషన్ ఆధ్వర్యాన జరిగిన సమావేశంలో తెలుగుదేశం జాతీయ విశిష్ట సేవా పురస్కారం, కన్నతల్లి ఫౌండేషన్ ఆధ్వర్యాన గోవాలో ఏర్పాటుచేసిన సమావేశంలో గోవా ఇంటర్నేషనల్ అవార్డుతో పాటు హైదరాబాద్‌లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అవార్డులను ఆమె ఇటీవల అందుకున్నారు. ఈ సందర్భంగా రుక్మిణిని శనివారం ఆశా స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయ్‌కుమార్, జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నారాయణవరపు శ్రీనివాసరావుతో పాటు చలమల హైమావతి, లింగనబోయిన పుల్లారావు, ఎనుముల రాముయాదవ్, దామాల సురేష్ తదితరులు సన్మానించారు.

ఆధ్యాత్మిక క్షేత్రంగా అంజనాపురం

- అభివృద్ధి చెందుతున్న భక్తాంజనేయ దేవాలయం
- ఆలయ ఆవరణలోనే శివాలయం పక్కనే 35 అడుగుల ఆంజనేయ విగ్రహం
- నేడు హనుమాన్ జయంతి
- నారాయణపురం నుంచి అంజనాపురం వరకు వేలాది మందితో పాద(శోభా) యాత్ర

సండే స్పెషల్



అంజనాపురంలో 35 అడుగుల ఆంజనేయ విగ్రహం పక్కనే ఉన్న శివాలయం, ఆంజనేయ దేవాలయాలు

తల్లాడ: భక్తుల పాలిట కొంగు బంగారంగా, ఆధ్యాత్మిక ప్రాంతంగా విరిజిల్లుతోంది అంజనాపురం ఆలయం. ఆ గ్రామం పేరు అసలు రేజర్ల. ప్రభుత్వ రికార్డుల్లో కూడా రేజర్లగానే పిలువబడుతుంది. కానీ రేజర్ల అంటే అధికారికంగా మాత్రమే. అంజనాపురం అంటే ఆ గ్రామాన్ని గుర్తు పడతారు.

1998లో వెలిసిన ఆంజనేయుడు..

1998లో అంజనాపురం జాతీయ రహదారి పక్కనే ఆంజనేయ స్వామి వెలిశారు. స్వామి వెలిసి నిత్యం పూజలు అందుకుంటూ దిన దినాభివృద్ధి చెందుతోంది. శిలా రూపంలో ఇక్కడ స్వామివారు వెలువగా తొలుత షెడ్డు, ఆ తర్వాత ఆలయం, అందులో విగ్రహాల ప్రతిష్ఠ, ఆలయం ముదు ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన చేశారు. ఆలయంలో ఆంజనేయుడి రాతి విగ్రహం ఎంతో ఆకర్షణగా ఉంటుంది. అప్పటి నుంచి ఇక్కడ హనుమాన్ జయంతి సందర్భంగా ప్రతి ఏటా ప్రత్యేక పూజలు, అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నారు.

అనుసంధానంగా రామలింగేశ్వర ఆలయం..

భక్తాంజనేయ స్వామి దేవాలయం కుడి పక్కనే గత ఆరేళ్ల క్రితం రామలింగేశ్వర స్వామి ఆలయాన్ని దాతలు, గ్రామస్తులు సహకారంతో నిర్మించారు. శివాలయంలో శివలింగ ప్రతిష్ఠ, ధ్వజస్తంభ ప్రతిష్ఠ చేశారు. అప్పటి నుంచి ఇక్కడ ఆలయం మరింత ప్రాచుర్యం పొందింది. శ్రీరామ దూత ఆంజనేయుడి దర్శనంతో పాటు శివలింగాన్ని కూడా దర్శించుకొనే భాగ్యం భక్తులకు కలిగింది.



భక్తాంజనేయ దేవాలయంలో వెలిసిన ఆంజనేయుని విగ్రహం

ప్రత్యేక ఆకర్షణగా 35 అడుగుల హనుమంతుడి విగ్రహం..

జాతీయ రహదారికి పక్కనే భక్తాంజనేయ స్వామి దేవాలయానికి కుడి పక్కన 35 అడుగుల హనుమంతుడి విగ్రహాన్ని దాతల సహకారంతో పదేళ్ల క్రితం ఏర్పాటు చేశారు. అతి పెద్ద ఆంజనేయుడి విగ్రహం ప్రతిష్ఠ చేసిన తర్వాత ఇక్కడ ఆలయం మరింత విశేష పూజలందుకొంటోంది. దీంతో ఈ ప్రాంతం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంటుంది.

నేడు హనుమాన్ జయంతి..

హనుమాన్ జయంతి సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రతి ఏటా మహా అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తారు. ఆదివారం హనుమన్ జయంతి సందర్భంగా తల్లాడ పంచాయతీ నారాయణపురం కోదండ రామాలయం నుంచి అంజనాపురం ఆలయం వరకు వేలాది మందితో పాద (శోభా) యాత్ర నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. జై వీర హనుమాన్ జెండాలతో పాద యాత్ర శోభయామానంగా జరగనుంది. వేలాది మంది భక్తులు హాజరై తీర్ధ ప్రసాదాలతో పాటు అన్నదానంలో పాల్గొంటారు.

హనుమంతుడి ఆశీర్వాదంతో అభివృద్ధి



ఇక్కడ 25 సంవత్సరాల క్రితం వెలిసిన ఆంజనేయ స్వామి భక్తుల పాలిట కొంగుబంగారంగా ప్రాచుర్యం పొందారు. అంతేకాదు ఈ ఆలయం జాతీయ రహదారి పక్కనే ఉండటం, అతిపెద్ద ఆంజనేయ విగ్రహం ఎంతగానో ఆకట్టుకుంటుంది. హనుమంతుడి ఆశీర్వాదంతోనే ఇక్కడ ఆలయం అభివృద్ధి చెందుతుంది.

– తేరాల రాధాకృష్ణ శర్మ, అంజనాపురం ఆలయం ప్రధాన అర్చకుడు

బొగ్గు దుమ్ము లేవకుండా తక్షణ చర్యలు

సత్తుపల్లిరూరల్: సత్తుపల్లి జేవీఆర్ ఓసీ, ఈపీసీ–సీహెచ్‌పీలో బొగ్గు దుమ్ము లేకుండా తక్షణమే చర్యలు తీసుకోవాలని సింగరేణి డైరెక్టర్ జి.వెంకటేశ్వరరెడ్డి ఆదేశించారు. ఆయన శనివారం ఓసీ, సీహెచ్‌పీని కొత్తగూడెం ఏరియా జీఎం జక్కం రమేష్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ మాట్లాడుతూ రక్షణతో కూడిన ఉత్పత్తి చేస్తూనే అన్ని జాగ్రత్తల నడుమ బొగ్గు రవాణా చేయాలని సూచించారు. స్థానికులకు శబ్ద, దుమ్ము కాలుష్యం ఎదురుకాకుండా రానున్న వర్షాకాలంలో మొక్కలు నాటాలని తెలిపారు. అలాగే, సీహెచ్‌పీ నిర్వహణపై సమంత కంపెనీ బాధ్యులకు ఆయన సూచనలు చేశారు. కాగా, రోజుకు 46,000 టన్నుల బొగ్గును రైలు, వాహనాల ద్వారా రవాణా చేయాలని స్పష్టం చేశారు. కొత్తగూడెం ఏరియా ఏజీఎం వై.రఘురావిరెడ్డి, అధికారులు ఎస్.వెంకటాచారి, ఎం.నర్సింహారావు, లక్ష్మణమూర్తి, పి.నర్సింహారావు, వి.కృష్ణయ్య, రమణారెడ్డి, మధుసూదన్ పాల్గొన్నారు.



జేవీఆర్ ఓసీలో సీహెచ్‌పీని పరిశీలిస్తున్న డైరెక్టర్, అధికారులు

బీజేపీని ఓడించాలి

బోనకల్: దేశ ప్రజలకు ప్రమాదకరంగా మారిన బీజేపీని ఓడించాలని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్‌రావు, మధిర నియోజక వర్గ ఇన్‌చార్జ్ పాలడుగు బాస్కర్ అన్నారు. శనివారం మండలంలోని జానకీపురం గ్రామంలో పార్టీ మధిర నియోజక వర్గ విస్తృత స్థాయి సమావేశం చింతలచెర్వు కోటేశ్వరావు అధ్యక్షతన జరిగింది. వైరాలో సీపీఎం గెలవాలంటే ఇప్పటి నుంచే నాయకులు, కార్యకర్తలు ప్రజల మధ్య ఉండి ప్రజా పోరాటాలు నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు బండి రమేష్, వాసిరెడ్డి వరప్రసాద్, బండి పద్మ, దొండపాటి నాగేశ్వరరావు, పురుషోత్తం, పిట్టల రవి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ శ్రేణుల సంబురాలు



మధిర: సంబురాలు నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

కర్ణాటక సార్వత్రిక అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘనవిజయం సాధించటంతో శనివారం సత్తుపల్లి, మధిర, వైరా నియోజకవర్గాల్లోని కాంగ్రెస్ శ్రేణులు సంబురాలు నిర్వహించాయి. ప్రధాన సెంటర్లలో ర్యాలీ నిర్వహించి, టపాసులు పేల్చి, స్వీట్లు పంపిణీ చేశారు. పలువురు కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ.. కర్ణాటక ప్రజలు అభివృద్ధికి పట్టం కట్టారని, మత రాజకీయాలు చేస్తున్న బీజేపీకి సరైన బుద్ధి చెప్పారని, దీని ప్రభా వం తెలంగాణ రాష్ట్రంపైన పడుతుందని అన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



సత్తుపల్లిలో సంబురాలు నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు



కారేపల్లిలో..



ముదిగొండ: వల్లబిలో..



ఏన్కూరులో..

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

బోనకల్: మండలంలోని రాపల్లి క్రాస్‌రోడ్డు వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి గాయాలైయ్యాయి. మధిర మండలం సిరిపురం గ్రామానికి చెందిన షేక్ హుస్సేన్ ద్విచక్ర వాహనంపై వైరా వైపు వెళ్తున్నాడు. రాపల్లి క్రాస్‌రోడ్డు వద్ద గొర్రెలు అడ్డం రావడంతో గొర్రెల కాపరిని ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో హుస్సేన్‌కు తీవ్ర గాయాలు కాగా గొర్రెల కాపరికి స్వల్ప గాయాలయ్యాయి. 108లో ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

లారీని ఢీకొని వ్యక్తికి..

సత్తుపల్లిరూరల్: గంగారం నుంచి సత్తుపల్లి వైపు ద్విచక్రవాహనంపై వస్తున్న ఓ వ్యక్తి ఆగి ఉన్న లారీ వెనుక నుంచి ఢీ కొట్టిన సంఘటనలో తలకు తీవ్ర గాయాలయ్యాయి. అన్నపురెడ్డిపల్లి గ్రామానికి చెందిన చల్లా వాసు శనివారం ద్విచక్రవాహనంపై గంగారం వైపు నుంచి సత్తుపల్లి వైపు వస్తుండగా తాళ్లమడ గ్రామం వద్ద రోడ్డు పక్కన ఆగి ఉన్న లారీని ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో వాసు తలకు తీవ్ర గాలయ్యాయి. క్షతగాత్రుడిని 108లో సత్తుపల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించటంతో చికిత్స పొందుతున్నాడు.

కేసు నమోదు

చింతకాని: మండలంలోని నేరడ గ్రామానికి చెందిన జిల్లపల్లి శాంతి చేసిన ఫిర్యాదు మేరకు భర్త రాజుపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో శనివారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నేరడ గ్రామంలో ఉన్నటువంటి తన తల్లి నివాసంలో శాంతి శుక్రవారం రాత్రి ఏసుక్రీస్తు ప్రార్థన పెట్టించింది. మోతె గ్రామానికి చెందిన భర్త రాజు తనకు చెప్పకుండా ప్రార్థన ఎందుకు పెట్టించావని భార్యపై గొడవ పెట్టుకుని భార్యను, అడ్డు వచ్చిన అత్తను, కుమార్తెను కర్రతో కొట్టడంతో అత్త చేయి విరగగా, భార్యకు గాయాలైనాయి. భార్య శాంతి చేసిన ఫిర్యాదు మేరకు ఎస్సై పొదిల వెంకన్న కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలి

సత్తుపల్లిరూరల్: చట్టసభలతో పాటు ఉద్యోగుల పదోన్నతుల్లో బీసీ రిజర్వేషన్ అమలు చేయాలని రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. సత్తుపల్లికి చెందిన టీఎస్‌పీ ఆర్టీయూ అధికార మాసపత్రిక బాధ్యుడు చిత్తలూరి ప్రసాద్, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత బొల్లెపల్లి మధుసూదన్‌రాజు, ఏపీ ఉపాధ్యాయ సంఘం నాయకులు పి.వెంకటేశ్వరరావు తదితరులు శనివారం హైదరాబాద్‌లో కృష్ణయ్యను కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీలకు ఉద్యోగ, పదోన్నతుల్లో రిజర్వేషన్, చట్టసభల్లో బీసీ రిజర్వేషన్లు అమలుచేసేలా ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు తాను చేస్తున్న పోరాటానికి మద్దతుగా నిలవాలని కోరారు.

రోడ్డు పనులు ప్రారంభం

కొణిజర్ల: మండలంలోని ఉప్పలచలక గ్రామం నుంచి పొలాలకు వెళ్లే డొంక రోడ్డు పనులను వైరా నియోజకవర్గ నాయకురాలు బానోత్ విజయాబాయి ప్రారంభించారు. గత నెల పర్యటించిన ఖమ్మం మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డిని గ్రామ ప్రజలు తమ గ్రామం నుంచి పొలాలకు వెళ్లే డొంకరోడ్డు బాగు చేయించి పెట్టమని అడిగారు. ఈ క్రమంలో రోడ్డును స్వయంగా పరిశీలించి తన సొంత ఖర్చులతో రోడ్డు మరమ్మతులు చేయిస్తానన్నారు. ఇచ్చిన మాటను నిలబెట్టుకొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గోసు మధు, సీనియర్ నాయకులు రాయల పుల్లయ్య, గుండ్ల కోటేశ్వరరావు, చల్లగుండ్ల సురేష్, వెంకటప్పయ్య, రాజారామ్, నాగేశ్వరరావు, వసంత్‌కుమార్, శోభన్, సంతు, బాలాజీ పాల్గొన్నారు.

ముగిసిన రేషన్ డీలర్ల నియామకాలు



ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న ఆర్డీఓ

కల్లూరు: కల్లూరు రెవెన్యూ డివిజన్ పరిధిలో ఖాళీగా ఉన్న రేషన్ షాపుల డీలర్లకు సంబంధించిన ఇంటర్వ్యూలు శనివారం ముగిసాయి. ఆర్డీఓ కార్యాలయంలో ఆర్డీఓ సీహెచ్ సూర్యనారాయణ శనివారం కల్లూరు, సత్తుపల్లి, తల్లాడ మండలాలకు ఇంటర్వ్యూలు జరిగాయి. మొత్తం 189 మంది అభ్యర్థులు హాజరు కావా ల్సి ఉండగా, 14 మంది గైర్హాజరు అయ్యారు. ఇంటర్వ్యూలు 1:5 నిష్పత్తిలో అభ్యర్థులను ఎంపిక చేశారు. ఖాళీగా ఉన్న 48 పోస్టులకు సంబంధించి నియామకాలు జరిగాయి. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ కొండలరావు, ఆర్డీఓ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

12 రకాల సరుకులివ్వాలి

వైరా: రేషన్ దుకాణాల ద్వారా మధ్య తరగతి కుటుంబాలకు 12 రకాల నిత్యావసర సరుకులు, 10 కేజీల బియ్యం ఇవ్వాలని పీవోడబ్ల్యూ రాష్ట్ర కార్యదర్శి సీహెచ్ శిరోమణి డిమాండ్ చేశారు. శనివారం వైరాలో పీవోడబ్ల్యూ ఆధ్వర్యంలో స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. పీవైఎల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్‌పీ రాకేష్, పీవోడబ్ల్యూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గోగినేపల్లి లలిత, టి.జాన్సీ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా హనుమాన్ శోభాయాత్ర



హనుమాన్ శోభాయాత్రను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య

సత్తుపల్లిటౌన్: జై శ్రీరాం.. జై హనుమాన్.. జైజై హనుమాన్ అంటూ భక్తుల నామస్మరణలతో సత్తుపల్లి మార్మోగింది. సత్తుపల్లి మెట్టాంజనేయస్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శనివారం రాత్రి నిర్వహించిన హనుమత్ శోభాయాత్ర అంగరంగ వైభవంగా సాగింది. సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య తొలుత పూజలు చేసి హనుమాన్ శోభయాత్రను ప్రారంభించారు. సీతారామ లక్ష్మణ హనుమాన్ వేషధారణలు.. విచిత్ర వేషధారణలు, శ్రీవేంకటేశ్వరస్వామి అవతారం, కోలాట నృత్యాలు ప్రజలను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఎన్టీఆర్‌నగర్ నుంచి రింగ్ సెంటర్ మీదుగా హనుమాన్‌నగర్ వరకు భక్తులు కాషాయ వస్త్రాలతో యాత్ర నిర్వహించారు. ట్రాక్టర్‌పై సుమారు 40 అడుగుల ఎత్తులో భారీ బతుకమ్మతో.. కోలాహలంగా యాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు మాధురి మధు, మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్, ఆత్మకమిటీ అధ్యక్షులు వాసు, రామలింగేశ్వరరావు, నర్సింహారావు, వెంకటేశ్వరరావు, ప్రసాద్, శివ, నరేందర్‌రెడ్డి, శర్మ పాల్గొన్నారు.

ఆలయంలో మాజీ మంత్రి తుమ్మల పూజలు..

హనుమాన్ జయంతిని పురస్కరించుకొని శనివారం స్థానిక ఎన్టీఆర్‌నగర్ మెట్టాంజనేయస్వామి ఆలయంలో మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆంజనేయస్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో చల్లగుళ్ల నర్సింహారావు, ఆలయ కమిటీ సభ్యులు మాధురి మధు, శివ, భక్తులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

బోనకల్: మండలంలోని ఆళ్లపాడు, రాయన్నపేట గ్రామాల్లో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను శనివారం జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్ పంపిణీ చేశారు. బీఆర్ఎస్ మండల అధ్యక్ష,కార్యదర్శులు చేబ్రోలు మల్లిఖార్జున్, మోదుగుల నాగేశ్వరరావు, కొండ, బందం శ్రీను తదితరులు పాల్గొన్నారు.

నేరడలో సైదేశ్వరరావుకు..

చింతకాని: మండలంలోని నేరడ గ్రామానికి చెందిన వంకాయలపాటి సైదేశ్వరరావుకు రైతుబంధు సమితి జిల్లా సభ్యులు మంకెన రమేష్ శనివారం సీఎం సహాయ నిధి రూ.60 వేలు చెక్కును పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో చింతకాని సొసైటీ డైరెక్టర్ కోటయ్య, బీఆర్ఎస్ నాయకులు వెంకటప్రసాద్, రాములు, బుచ్చాలు, ముత్తయ్య, వెంకయ్య, మరియన్న తదితరులు పాల్గొన్నారు.



బోనకల్‌లో చెక్కు అందజేస్తున్న జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్

జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోండి



వైరా : పోస్టర్లు ఆవిష్కరిస్తున్న విజయాబాయి, జైపాల్ తదితరులు



మధిర: పోస్టర్లు ఆవిష్కరిస్తున్న రాంబాబు, నాయకులు

వైరా/మధిర: మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి నేతృత్వాన ఈనెల 29న ఖమ్మం ఎస్ఆర్ గార్డెన్స్‌లో నిర్వహించే మెగా జాబ్ మేళాను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని వైరా మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్, నాయకులు బానోత్ విజయాబాయి సూచించారు. వైరాలో శనివారం వారు జాబ్ మేళా పోస్టర్లు ఆవిష్కరించి మాట్లాడారు. దాదాపు 150 కంపెనీల బాధ్యులు హాజరుకానుండగా పది వేల మందికి ఉపాధి అవకాశం లభిస్తుందని తెలిపారు. నాయకులు మిట్టపల్లి నాగి, దార్న రాజశేఖర్, ఫణితి సైదులు, పంది సైదులు, కన్నెగంటి హుస్సేన్, సీతారాములు, వెంకన్న, రవి, గుగులోత్ లక్ష్మీబాయి, నరేష్, రామారావు పాల్గొన్నారు. అలాగే, జాబ్‌మేళా పోస్టర్లను మధిరలో డాక్టర్ కోట రాంబాబు ఆవిష్కరించగా నాయకులు యన్నం కోటేశ్వరరావు, యర్రగుంట రమేష్, గుండెమెడ బాలాజీ, బాహాటం శ్రీనివాసరాజు, సయ్యద్ అక్బర్, దోర్నాల మణిబాబు, తమ్మిశెట్టి బాలకృష్ణ, వినుకొండ వెంకటేశ్వర్లు, సీతారామయ్య పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి



కరపత్రాలు పంచుతూ ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

సత్తుపల్లిరూరల్: కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని మాజీ మంత్రి సంభాని చంద్రశేఖర్ అన్నారు. హాథ్ సే హాథ్ జోడో యాత్రలో భాగంగా శనివారం మండలంలోని కిష్టారం, కొత్తూరు గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ జెండాలను ఆవిష్కరించి ఇంటింటికి కరపత్రాలతో ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ కర్ణాటకలో మాదిరిగానే తెలంగాణలో కూడా విజయం సాధిస్తుందన్నారు. కేంద్ర, రాష్ట్ర వైఫల్యాలపై రూపొందించిన కరపత్రాలను ప్రజలకు అందించారు. ఈ కార్యక్రమంలో మండల, పట్టణ అధ్యక్షులు శివ వేణు, కొర్రపాటి సాల్మన్‌రాజు, కె.కిరణ్, ఎ.వెంకటేశ్వరరావు, సర్పంచ్ ప్రభాకర్, కృష్ణ, మున్వర్ హుస్సేన్, శ్రీనివాసరావు, రామకృష్ణ, ఆదినారాయణ, రాఘవులు ఫయాజ్, హరీష్, ఖాదర్ పాల్గొన్నారు.

నిరుపేదలకు అన్నదానం

మధిర: మధిర పట్టణంలోని వైరా రోడ్డులో వేంచేసి ఉన్న శ్రీ లక్ష్మి పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం జోగి వెంకటరెడ్డి, విజయలక్ష్మి తదితరుల ఆర్థిక సహకారంతో నిరుపేదలకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమాన్ని ప్రముఖ వ్యాపారి వజ్రాల శ్రీనివాసరెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు ముత్తయ్య, మున్సిపల్ కౌన్సిలర్ వాసు, నరసింహారావు, కృష్ణమూర్తి, కృష్ణ సూరి పాల్గొన్నారు.

ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి

వైరా: క్రమశిక్షణతో విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఎమ్మెల్యే లావుడ్యా రాములునాయక్ అన్నారు. సీబీఎస్ఈ పరీక్షా ఫలితాల్లో జాతీయ స్థాయి ర్యాంకులు సాధించిన వైరా శాంతినగర్‌లోని న్యూలిటిల్‌ఫ్లవర్స్ పాఠశాల విద్యార్థులను వైరా ఎమ్మెల్యే లావుడ్యా రాములునాయక్ ఘనంగా సత్కరించారు. శనివారం వైరా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆల్ ఇండియా ర్యాంకులు సాధించిన పాఠశాల విద్యార్థులు కశాల్, యం.నాగసాయి, యశ్వంత్‌లను ఆయన సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ పి.భూమేశ్వరరావు, డాక్టర్ కాపా మురళీ కృష్ణ, కుర్రా సుమన్, లగడపాటి ప్రభాకర్‌రావు, ప్రిన్సిపల్ షాజీ మాథ్యు, ఏఓ నరసింహారావు పాల్గొన్నారు.

ఇంటర్ విద్య కీలకం ..


మధిర: జీవితంలో ప్రతి విద్యార్థికి ఇంటర్మీడియట్ విద్య కీలకమని జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్ తెలిపారు. భరత్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో పదో తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు శనివారం భరత్ టెక్నో స్కూల్‌లో అభినందన సభ ఏర్పాటు చేశారు. భరత్ విద్యాసంస్థల అధినేత శీలం వెంకటరెడ్డి అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ.. పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు నమోదు చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ లలిత, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ శీలం విద్యాలత, ఎంఈఓ వై ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్

తాగు నీరు వృథా..!

కొణిజర్ల మండలంలోని మల్లుపల్లి పంచాయతీ వడ్డెర బజార్‌లో తాగునీటి సరఫరా చేసే పైపులైను పగిలి నీరంతా వృథాగా పోతుంది. గత పదిరోజులుగా నీరు రోడ్డుపై పోతున్నా అటు అధికారులు కానీ, ఇటు పంచాయతీ సిబ్బంది కానీ పట్టించుకున్న పాపాన పోలేదు. అసలే ఏండాకాలం తాగునీరు వృథాగా పోవడంతో తమకు నీరు రావడం లేదని వడ్డెర కాలనీ వాసులు వాపోతున్నారు. పంచాయతీ సిబ్బందికి పాలక మండలి సభ్యులకు ఎన్ని సార్లు చెప్పినా పెడచెవిన పెడుతున్నారన్నారు. కనీసం మిషన్ భగీరథ అధికారులైనా స్పందించి పైప్‌లైన్ మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు.

– కొణిజర్ల



ప్రశ్నించాల్సిన అధికారి : చైతన్య, మిషన్ భగీరథ ఏఈఈ, కొణిజర్ల
సెల్ నంబర్ : 79956 60558